



జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు







| మంగళవారం 12 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 344 | సింగపూర్‌తో వాణిజ్య, పెట్టుబడి అవకాశాలపై ఏపీ దృష్టి | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|








## గ్రామీణ ఉపాధి రంగంలో భారీ మార్పులు.. జూలై 1 నుంచి 'వీబీ-గ్రామ్ జీ' అమలు


సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 12, ప్రతినిధి: దేశ గ్రామీణ ఉపాధి రంగంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో 'వికసిత్ భారత్–గ్రామీణ్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్' (వీబీ-గ్రామ్ జీ) చట్టాన్ని జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. కొత్త చట్టం ద్వారా గ్రామీణ కుటుంబాలకు సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ కల్పించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం రూ.95,692 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించినట్లు సమాచారం.కొత్త విధానంలో కేవలం కూలి పనులకే పరిమితం కాకుండా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, నీటి సంరక్షణ, ఉపాధి ఆధారిత ఆస్తుల సృష్టి, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామపంచాయతీలకు మరింత అధికారాలు కల్పిస్తూ డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. పనుల పురోగతిని ప్రత్యేక డాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షించే విధానాన్ని కూడా అమలు చేయనున్నారు. మహిళా కార్మికుల కోసం ప్రత్యేక శిశు సంరక్షణ సౌకర్యాలు, పనులు లభించని పరిస్థితుల్లో నిరుద్యోగ భృతి, గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి కీలక అంశాలను కొత్త చట్టంలో చేర్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న జాబ్ కార్డులు తాత్కాలికంగా కొనసాగుతాయని, తరువాత కొత్త 'గ్రామీణ ఉపాధి హామీ కార్డులు' జారీ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ చట్టంపై విపక్షాలు, కార్మిక సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధి హక్కు బలహీనపడే ప్రమాదం ఉందని, పేదలకు ఉపాధి అందుబాటు తగ్గవచ్చని పలు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయినప్పటికీ గ్రామీణాభివృద్ధిని 'వికసిత్ భారత్–2047' లక్ష్యాలకు అనుగుణంగా మార్చేందుకే ఈ సంస్కరణలు చేపడుతున్నామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సింగపూర్‌తో వాణిజ్య, పెట్టుబడి అవకాశాలపై ఏపీ దృష్టి



సందేశం టైమ్స్, అమరావతి, మే 12, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్య, ఎగుమతి రంగాలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వామ్యాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో సింగపూర్‌లోని కమోడిటీస్ ఇంటెలిజెన్స్ సెంటర్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి గ్లోరియా వూ తో రాష్ట్ర ప్రతినిధులు సమావేశమై కొత్త వాణిజ్య, ఎగుమతి అవకాశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్, వ్యవసాయ ఎగుమతులు, ఖనిజాలు, హరిత ఇంధన రంగాల్లో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొంటూ, బ్లాక్‌చైన్ ఆధారిత గ్లోబల్ కమోడిటీస్ వేదిక ద్వారా ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని చర్చించారు. పోర్ట్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధితో పాటు గ్లోబల్ సరఫరా గొలుసులను బలోపేతం చేయడం, ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారులకు మార్కెట్ అవకాశాలు, లాజిస్టిక్స్, వాణిజ్య రుణ సదుపాయాలు అందించడంపై రాష్ట్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని వెల్లడించారు. ఈ ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.మరోవైపు సింగపూర్‌లోని ప్రముఖ సన్‌టెక్ సిటీ ను సందర్శించిన రాష్ట్ర ప్రతినిధులు, విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో ఆధునిక మైస్ (సమావేశాలు, ప్రదర్శనలు, అంతర్జాతీయ కార్యక్రమాలు) వ్యవస్థను అభివృద్ధి చేసే అంశంపై చర్చలు జరిపారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని హోటల్ గదుల సామర్థ్యాన్ని 20 వేల గదులకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అమరావతిలో ఇప్పటికే నాలుగు కన్వెన్షన్ సెంటర్లకు అనుమతులు మంజూరు కాగా, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విశాఖపట్నంలో ప్రపంచ స్థాయి మైస్ కేంద్రం ఏర్పాటు కానుందని వెల్లడించారు. అలాగే Google, TCS, Cognizant వంటి అంతర్జాతీయ సాంకేతిక సంస్థలు విశాఖపట్నంలో విస్తరణ చేపడుతుండటంతో, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ వ్యాపార, ప్రదర్శనల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

## బండి భగీరథ్ కేసుపై సిట్ ఏర్పాటు.. మహిళా ఐపీఎస్ పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతం




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేసు సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో విచారణ కొనసాగించనున్నట్లు తెలిసింది. బాధితురాలు బాలిక కావడం, ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని సిట్ బృందం కీలక ఆధారాల సేకరణ ప్రారంభించినట్లు సమాచారం. బాధిత బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం నమోదు చేసిన పోలీసులు, ఆ వివరాల ఆధారంగా మరిన్ని అంశాలను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కేసులోని ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా విచారించి నిజానిజాలు బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.



## మోడీ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను కొందరు తమకు నచ్చిన విధంగా వక్రీకరిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రినని గుర్తుచేసిన ఆయన, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని చెప్పారని, అది వ్యక్తిగతంగా తనకు సంబంధించిన వ్యాఖ్య కాదని, తెలంగాణ అభివృద్ధి కోసమే ఆ సూచనలు చేశారని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, అభివృద్ధి ప్రాజెక్టులకు సహకారం వంటి అంశాలపైనే ప్రధాని నరేంద్ర మోడీతో చర్చించినట్లు సీఎం తెలిపారు. ప్రధాని వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదని, తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి మరింత సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## చెరువుల కబ్జాలకు హైడ్రా హైటెక్ చెక్.. 900 సీసీటీవీలతో పటిష్ట నిఘా



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు హైడ్రా అత్యాధునిక నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. చెరువులను మట్టితో నింపి ఆక్రమణలకు పాల్పడే ప్రయత్నాలను అడ్డుకునేందుకు చెరువుల పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి వాటిని హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానం చేసింది. చెరువుల వద్ద జరుగుతున్న ప్రతి కదలికను నేరుగా హైడ్రా కార్యాలయం నుంచే పర్యవేక్షించే విధంగా ప్రత్యేక వ్యవస్థను రూపొందించారు. ఈ హైటెక్ సీసీటీవీ నిఘా వ్యవస్థను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం ప్రారంభించారు. ఇప్పటికే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లు చెరువుల వద్ద పర్యవేక్షణ కొనసాగిస్తుండగా, ఇప్పుడు సీసీటీవీ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో నిఘా మరింత బలోపేతమైంది. మొత్తం దాదాపు 900 కెమేరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. చెరువుల్లో నిర్మాణ వ్యర్థాలు వేయడం, మట్టిని పోసి ఆక్రమణలకు యత్నించడం వంటి చర్యలను కెమేరాల ద్వారా వెంటనే గుర్తించే అవకాశం ఏర్పడింది. హైడ్రా కార్యాలయంలోని కంట్రోల్ రూం నుంచి ప్రత్యేక మానిటర్ల ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తారు. అనుమానాస్పద వాహనాలు లేదా మట్టిని తరలించే వాహనాల వివరాలను గుర్తించి వెంటనే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లను అప్రమత్తం చేసే విధంగా వ్యవస్థను రూపొందించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కూడా ఈ కెమేరాలను అనుసంధానం చేయడంతో నిఘా మరింత సమర్థవంతంగా మారుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం: సీఎం చంద్రబాబు




సందేశం టైమ్స్, అమరావతి, మే 12, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గత 22 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకురాగలిగామని, వాటి ద్వారా సుమారు 24 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించేందుకు మార్గం సుగమమైందని తెలిపారు. దేశ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాల్లో భాగంగా 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ఆంధ్రప్రదేశ్‌లోనే సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని యూనిట్‌కు 30 పైసలు తగ్గించామని, త్వరలోనే మరో రూ.1.30 మేర తగ్గించే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అమరావతిని అత్యాధునిక సాంకేతికతతో కూడిన సమగ్ర నగరంగా అభివృద్ధి చేస్తున్నామని, నెట్ జీరో కాన్సెప్ట్‌తో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సుస్థిరత, సాంకేతికత, ఉపాధి సృష్టి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.




# బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక బృందాలతో సమగ్ర దర్యాప్తు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన బండి భగీరథ్ కేసుపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర పోలీసు అధికారులను ఆదేశించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర పోలీసు మహానిర్దేశకుడు సీవీ ఆనంద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు అందినప్పటికీ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ప్రధానమంత్రి హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో ఆలస్యం జరిగిందని డీజీపీ తెలిపారు. అనంతరం విచారణను తక్షణమే వేగవంతం చేసి, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# విద్యా వారోత్సవాలకు ఘన ప్రారంభం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం లో నిర్వహించిన విద్యా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు పలు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, భవిష్యత్తులో రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు నిమ్స్‌లో ఉచిత మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ నిమ్స్ ఆసుపత్రిలో ఉచిత మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం నిర్వహించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కోరింది. ఈ మేరకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరి రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టులు నిత్యం ప్రజల మధ్య పనిచేస్తూ ఒత్తిడికి గురవుతుంటారని, అందువల్ల వారు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించిన మంత్రి, నిమ్స్ ఆసుపత్రిలో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినాకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు మరియు రాష్ట్ర ప్రభుత్వానికి హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి కృతజ్ఞతలు తెలిపింది.

# న్యాయవ్యవస్థ డిజిటలైజేషన్‌కు శ్రీకారం.. 'వన్ కేస్ – వన్ డేటా' ప్రారంభం



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 12, ప్రతినిధి: దేశ న్యాయవ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'వన్ కేస్ – వన్ డేటా' పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడానికి వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టులు, జిల్లా కోర్టులు, తాలూకా కోర్టులకు సంబంధించిన కేసుల వివరాలు ఒకే డేటా వ్యవస్థలో సమగ్రంగా అందుబాటులో ఉండనున్నాయి. దీని వల్ల కేసుల ట్రాకింగ్, సమాచార మార్పిడి, విచారణల నిర్వహణ మరింత వేగవంతం కానుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. అదేవిధంగా సాధారణ ప్రజలకు న్యాయసేవలను సులభతరం చేయడానికి 'సు సహాయ్' పేరుతో కృత్రిమ మేధస్సు ఆధారిత చాట్‌బాట్‌ను కూడా సీజేఐ పరిచయం చేశారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ మరియు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ చాట్‌బాట్ ద్వారా కోర్టు సేవలు, కేసుల స్థితి, న్యాయపరమైన సమాచారం, విధానాలపై ప్రజలకు తక్షణ సహాయం అందనుంది. న్యాయవ్యవస్థను డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చే దిశగా ఈ చర్యలు మైలురాయిగా నిలుస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 12, ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కార వేదికగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పాత పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా వచ్చే అర్జీలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న 20 దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ఉద్యోగుల బదిలీల కోసం ఎవరైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 71 దరఖాస్తులు అందగా, వాటిని శాఖల వారీగా పంపించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు: కలెక్టర్



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 12, ప్రతినిధి: గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కే నరసింహ తో కలిసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, అంతరాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పశువుల రవాణాపై కఠిన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సరైన పత్రాలు లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిపై చర్యలు తీసుకోవాలని, సంతలో కొనుగోలు చేసిన పశువులకు తప్పనిసరిగా రహదారి బిల్లు ఉండాలని సూచించారు. బక్రీద్ పండుగను శాంతి, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 12, ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం కింద చేపడుతున్న ఎస్ఐర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న 15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. వీఐపీలు, ఉద్యోగుల వివరాల మ్యాపింగ్ ఇంకా పూర్తి కాని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సందేహాలను వెంటనే నివృత్తి చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే 71 శాతం ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో 72 శాతం ప్రక్రియ పూర్తైందని, త్వరలో పూర్తి స్థాయిలో మ్యాపింగ్ పూర్తి చేస్తామని వెల్లడించారు.

# చింతకాని మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను మధిర నియోజకవర్గానికి చెందిన నూతన కాంగ్రెస్ అధ్యక్షులు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన కన్నెబోయిన గోపి మండల కాంగ్రెస్ కమిటీ నాయకులతో కలిసి ఉప ముఖ్యమంత్రిని కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి కట్టుబడి క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై భట్టి విక్రమార్క నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్ రావు, సీనియర్ నాయకులు ఆలస్యం బసవయ్య, నారగాని శ్రీనివాసరావు, కుక్కల వెంకటేశ్వర్లు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు



సందేశం టైమ్స్, చింతకాని, మే 12, ప్రతినిధి: మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో వేషాల సూర్యనారాయణ-లక్ష్మీకాంతమ్మ కుమారుడు శంకర్రావు, కావ్యశ్రీల వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రేపల్లెవాడ మాజీ సర్పంచ్ అంగడి ఝాన్సీ సుధాకర్, బండి శ్రీనివాసరావు, షేక్ ఏసోబు, సామినేని శ్రీనివాసరావు, కొత్తపెల్లి వెంకటేశ్వర్లు (శివ), కట్ట రాములు, షేక్ పుల్లయ్య, వడ్డెబోయిన గోపి, పగిడిపల్లి నాగరాజు, వడ్రానపు గౌతమ్, పగిడిపల్లి కిషోర్, సామినేని ఫణీందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మొక్కజొన్నల తరలింపులో జాప్యంపై రైతుల ఆందోళన.. తక్షణ చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



సందేశం టైమ్స్, చింతకాని, మే 12, ప్రతినిధి: చింతకాని మండలంలో కాటాలు వేసి కల్లాల వద్దనే నిల్వగా ఉన్న మొక్కజొన్నలను వెంటనే తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత 45 రోజులుగా లారీలు, గోదాముల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ అధికారులు రోజుకు కేవలం 200 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో పరిస్థితి మరింత కష్టతరమైందని తెలిపారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో పాటు కాంట్రాక్టర్లు కృత్రిమ కొరత సృష్టించి క్వింటాకు అదనంగా రూ.100 నుంచి రూ.120 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హనుమంతరావు, బొడ్డు వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ



సందేశం టైమ్స్, కోదాడ, మే 12, ప్రతినిధి: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ పురపాలక సంఘం చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ కోరారు. సోమవారం కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మే 11 నుంచి 25 వరకు 15 రోజులపాటు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డ్రాయింగ్, నృత్యం, ఇండోర్ గేమ్స్, చెస్, క్యారమ్స్, క్రాఫ్ట్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రతిభ పెంపొందించుకోవడానికి ఈ శిబిరం ఉపయోగపడుతుందని కోదాడ మండల విద్యాధికారి ఎం.డి. సలీం షరీఫ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, 13వ వార్డు కౌన్సిలర్ మోడే గురువమ్మ సైదీ బాబు, ఉపాధ్యాయులు ఎస్.కె. ఖాజామీయా, యోగ మాస్టర్ శ్రీనివాసు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం డివిజన్‌లో 19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి: ప్రజా ప్రతినిధుల పిలుపు




సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 12, ప్రతినిధి (బి. డేవిడ్): బొల్లారం డివిజన్ అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం ఒకేరోజు సుమారు 19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తి, గాంధీ నగర్, ఐడిఎ కాలనీ, కె.బి.ఆర్ కాలనీ, లక్ష్మి నగర్, శ్రీరామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో ఈ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్‌లో ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు. గతంలో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్యను కూడా పరిష్కరించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తామని, అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపిపి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, ఇంజినీరింగ్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 27 దరఖాస్తులు.. సమస్యల తక్షణ పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 12, నియోజకవర్గ ఇంచార్జి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 27 దరఖాస్తులు అందాయి. డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన రైతులు, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉమా హారతి మాట్లాడుతూ అందిన ప్రతి ఫిర్యాదును అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అభ్యర్థనను అధికారులు ప్రాధాన్యంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం జరగకుండా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

## వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం దరఖాస్తు పల్లి గ్రామ సర్పంచ్‌గా గ్రామ ప్రజల విశ్వాసంతో ఎన్నికై అభివృద్ధి పనులు చేపడుతూ సేవలందిస్తున్న సత్యనారాయణ గౌడ్ మరియు ఆయన సతీమణి సురేఖ లకు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు మాట్లాడుతూ అన్యోన్యతతో ముందుకు సాగుతున్న ఈ దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆశీస్సులతో మరింత సేవాభావంతో ముందుకు సాగాలని ఆయన తెలిపారు.

## ఆత్మరక్షణకు కరాటే దోహదం.. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి: సినీ నటుడు సుమన్




సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 12, ప్రతినిధి (బి. సంగమేశ్వర్): ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సినీ నటుడు సుమన్ సూచించారు. దీని ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, సినీ నటుడు సుమన్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే దొరకడం పటాన్‌చెరు ప్రజల అదృష్టమని ప్రశంసించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడాది పొడవునా క్రీడా పోటీలు నిర్వహిస్తూ యువతలో క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఘనంగా నిర్వహణ



సందేశం టైమ్స్, గొర్రెకల్, మే 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం గొర్రెకల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ లింగారెడ్డి తిరుపతి అధ్యక్షతన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన భూసార శాస్త్రవేత్త డా. రాజేశ్వర్ నాయక్ రైతులకు పంట దిగుబడి పెంచడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం యూరియా, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. మరో శాస్త్రవేత్త డా. సుష్మ మాట్లాడుతూ అవసరానికి తగ్గట్టుగా మాత్రమే ఎరువులు వినియోగించాలనీ, రసాయనాల వినియోగం తగ్గించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. సాగునీటి సంరక్షణతో పాటు సేంద్రీయ వ్యవసాయాన్ని అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సుమారు 80 మంది రైతులు పాల్గొని శాస్త్రవేత్తల సూచనలను ఆసక్తిగా వినిపించారు. ఏఈఓ ప్రవీణ్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## బీరప్ప స్వామి కామారతి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొనడం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 12, జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా ఫసల్వాది గ్రామ శివారులో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామి-కామారతి కళ్యాణ మహోత్సవంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే సంప్రదాయ ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, గ్రామ సర్పంచ్ హరిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, శ్రవణ్ రెడ్డి, వాజిత్, కౌన్సిలర్ సోము తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ ప్రతీక్ జైన్





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 12, ఇంచార్జి కె. సంగమేశ్వర్: జిల్లాలో ఈ నెల 13 నుండి 21 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 13,862 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, అందులో మొదటి సంవత్సరం 9,591 మంది, రెండో సంవత్సరం 4,271 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించనుండగా, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ, పోస్టల్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా పోలీసు బందోబస్తు మధ్య జరగాలని, పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేయాలని ఆదేశించారు. జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీరు, గాలి, వెలుతురు సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్




సందేశం టైమ్స్, మెదక్, మే 12, ప్రతినిధి: మెదక్ జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ నగేశ్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తూకంలో 41.6 కేజీలకు బదులు 42 నుండి 44 కేజీలు వేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని, తేమశాతం నిబంధనలు కఠినంగా అమలు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే టెంట్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. రైస్ మిల్లుల్లో సమయానికి అన్‌లోడింగ్ జరగకపోవడంతో సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, మల్లేశం మాట్లాడుతూ జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, సరిపడా లారీలు, గోనె సంచులు ముందుగానే సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గౌరయ్య, అజయ్, దుర్గ యాదగిరి, వెంకట్, నరేందర్, నహీం, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ, ఆశా వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి: సీఐటీయూ డిమాండ్



సందేశం టైమ్స్, మెదక్, మే 12, ప్రతినిధి: అంగన్వాడీ, ఆశా వర్కర్ల ఏప్రిల్ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చి. గౌరయ్య మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే అమలు చేయాలని, 2023లో జరిగిన 24 రోజుల సమ్మె డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ.18,000 అమలు చేయాలని, కేంద్రం ప్రకటించిన అదనపు వేతనం రూ.1,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్ డ్యూటీలకు అదనపు పారితోషికం చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 12, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారం మండల కేంద్రంలోని ప్యాక్స్ వరి కొనుగోలు కేంద్రం, సత్య సాయి రైస్ మిల్‌ను అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్ని బ్యాగుల సరఫరా, లారీలు అందుబాటు, ఓపీఎంఎస్ నమోదు వంటి అంశాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, అన్లోడింగ్ సమయంలో సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు సమన్వయంగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటివరకు ఈ కేంద్రం నుంచి 13 లారీల ధాన్యం సత్య సాయి రైస్ మిల్లుకు తరలించినట్లు వెల్లడించారు. హమాలీల కొరత లేదని, సివిల్ సప్లై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.



## ధాన్యం లారీల కోసం రైతుల ధర్నా.. హవేలీఘనపూర్‌లో ఉద్రిక్తత

సందేశం టైమ్స్, మెదక్, మే 12, ప్రతినిధి: మెదక్ జిల్లా హవేలీఘనపూర్ కొనుగోలు కేంద్రానికి లారీలను వెంటనే పంపించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. మెదక్–బోధన్ రహదారిపై ట్రాక్టర్‌తో ధాన్యం బస్తాలను అడ్డుగా వేసి రైతులు ధర్నా నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న హవేలీఘనపూర్ ఎస్సై, ఎమ్మార్వో సింధు రేణుక సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వగా ఉండటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నామని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. లారీలు వెంటనే పంపిస్తామని ఎమ్మార్వో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఘటన కారణంగా సుమారు అరగంటపాటు రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది: కొప్పుల లక్ష్మి శేషారెడ్డి



సందేశం టైమ్స్, అల్లాదుర్గం, మే 12, మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి అన్నారు. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామంలో శ్రీమతి చింతాళీ లక్ష్మి–నర్సింలు దంపతుల నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ వారి కలలను నెరవేరుస్తోందని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు పేదల పక్షాన ప్రభుత్వం నిలబడి ఇళ్లను మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిలు, సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమగ్ర ఖచ్చిత గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్, మే 12, ప్రతినిధి: సమగ్ర, ఖచ్చిత గణాంకాల రూపకల్పనలో జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జనగణన 2027లో భాగంగా జిల్లాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాందాస్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు జరిగిన మారథాన్ వాక్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, ప్రజలతో కలిసి ఇంటింటి సందర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జనగణన ట్యాబ్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత దేశంలో జనగణన జరుగుతోందని, కోవిడ్ కారణంగా 2021లో జరగాల్సిన ప్రక్రియ వాయిదా పడిందని తెలిపారు. ఇది స్వాతంత్ర్యానంతరం 16వ జనగణన కాగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత ఇది తొలి జనగణన అని పేర్కొన్నారు. మొదటిసారి డిజిటల్ విధానంలో స్వీయగణన పద్ధతిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే ఈ విధానంలో 34 ప్రశ్నలు ఉంటాయని, ఐదు నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. సోమవారం నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. గుర్తింపు కార్డులు కలిగిన అధికారులకే సహకరించాలని, QR కోడ్ ద్వారా వారి వివరాలు ధృవీకరించవచ్చని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజు, ఆర్డీవో రమాదేవి, డీఎఫ్ఓ జోజి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



సందేశం టైమ్స్, మెదక్, మే 12, ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. వీఐపీ, వీవీఐపీ ఓటర్ల వివరాల మ్యాపింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతం పైగా పురోగతి సాధించాయని, అయితే తెలంగాణలో ఇంకా వేగం పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## పిప్పడపల్లి గ్రామంలో సువార్త కూడికల పత్రిక ఆవిష్కరణ



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, మే 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడపల్లి గ్రామంలోని మెథడిస్ట్ చర్చిలో రక్షణ కుటుంబాల ఆశీర్వాద సువార్త కూడికల కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించారు. మే 23, 24 తేదీలలో నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమం మెథడిస్ట్ సంఘకాపరి పాస్టర్ రవీందర్, పాస్టర్ సంజీవ్, స్టార్ యూత్ ప్రెసిడెంట్ యం. రాజ్ కుమార్ మరియు సంఘ పెద్దల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వాసం, ప్రేమ, ఆత్మీయత పెంపొందించేలా ఈ కూడికలు నిర్వహించబడుతున్నాయని పేర్కొంటూ, ప్రతి కుటుంబం దేవుని ఆశీర్వాదాలు పొందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యం. సంజీవ్, యం. విజయ్, ఏర్రోళ్ల రాజ్ కుమార్, ఏర్రోళ్ల పాలు, ఏర్రోళ్ల అనిల్ కుమార్, యం. పాలు, యం. మోహన్, జనోళ్ల అనిల్ కుమార్, దేవదానం, ప్రశాంత్, యం. సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ – గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరాలు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 12, ప్రతినిధి: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాలపై ముఖ్యమంత్రి గారు గవర్నర్‌కు వివరించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే రోజున విద్యార్థులతో పొగాకు, మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్నట్లు తెలిపారు. అదే రోజున విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, క్రీడా దుస్తులు సహా అవసరమైన విద్యా కిట్లు అందజేయనున్నట్లు గవర్నర్‌కు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. విద్యా సంస్థలను సురక్షితంగా, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ, పోలీస్ శాఖ, ఈగల్ (EAGLE) సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యాజమాన్యాల సమష్టి బాధ్యతపై అవగాహన కల్పించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే గవర్నర్ పరిశీలనకు పంపుతామని తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.